క్లుప్తంగా

చౌక దుకాణానికి దరఖాస్తు చేసుకోండి

చిట్వేలి : నగిరిపాడు పంచాయతీలో కుమ్మరపల్లి చౌక దుకాణం నెంబరు. 31 ఖాళీగా ఉందని తహసీల్దార్ మోహన్ కృష్ణ గురువారం తెలియజేశారు. దీనికి దివ్యాంగులు (జనరల్)కు కేటాయించామన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల లోపు వయస్సు ఉన్నవారు స్త్రీ, పురుషులు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె : మండల పరిధిలోని ప్రకాష్‌నగర్ కాలనీ గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ భూమి – మీ హక్కు ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అనంతరం భూ సమస్యలపై వచ్చిన అర్జీలను మంత్రి స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ నరసారెడ్డి, మాజీ సర్పంచ్ శిధర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, సర్పంచ్ మోహన్, నాయకులు నాగేశ్వరనాయుడు, శివప్రసాదరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్రవ బీజామృతంపై శిక్షణ



బీజామృతం తయారీని వివరిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని ఎస్‌వీఎస్ గిరిజన కాలనీలో మంగళవారం ద్రవ బీజామృతంపై ఏఓ రమేష్ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెచ్ఓ భాస్కర్ పాల్గొన్నారు. అనంతరం వారు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అంబలం పూజ



పూజ నిర్వహిస్తున్న గురుస్వాములు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి అయ్యప్ప స్వామి అంబలం పూజ అత్యంత ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమానికి పంచాయతీ చుట్టుపక్కల గ్రామాల నుంచి దాదాపు 120 మంది భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఈ పూజ కార్యక్రమాన్ని అభినేని బాలకృష్ణ, ఆదాల ప్రసాద్ రెడ్డి, రాఘవరెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డిలు ఏర్పాటు చేశారు. అయ్యప్ప గురుస్వాముల దగ్గర నుండి పూజలు జరిపించారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించండి

రామాపురం : మండలంలోని గువ్వలచెరువు, కసిరెడ్డిగారిపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం డివిజన్ సహాయ సంచాలకులు జయరాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేసిన వరి, వేరుశనగ, టమాట, మామిడి పంటలు సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రంలో ధృవీకరణ పత్రాలు తీసుకొని పంటల బీమా చేసుకోవాలన్నారు. మామిడి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త మానస రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారుల, రైతు సేవ కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 25 మంది ఎంపిక



మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధి

రాయచోటి టౌన్ : పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా 25 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు పాలిటెక్నికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెన్నకేశవ ప్రసాద్ తెలిపారు. మంగళవారం రాయచోటి పాలిటెక్నికల్ కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ రకాల కంపెనీలకు చెందిన ప్రతినిధులు వచ్చారన్నారు. జాబ్‌మేళాలో టాటా క్యాపిటల్, డిక్సన్ టెక్నాలజీ, నవ భారతి కంపెనీ, క్రెడిట్ యాక్సెస్, కాన్వేజీ వైసెస్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ (టీపీఓ) సహదేవ, ఏపీఎస్ఎస్‌డీసీ టీపీఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. దుర్భరం

కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలను పట్టించుకోవడంలేదు. నాయకులు, అధికారుల నిర్లక్ష్య వైఖరితో ప్రజలు రోగాల బారీన పడుతున్నారు. సంబేపల్లె మండలంలోని గ్రామాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు నిలుస్తుండటంతో గ్రామాల్లో దోమల బెడద ఎక్కువైంది. వారానికి ఒకరోజు వైద్య, ఆరోగ్య సిబ్బంది పంచాయతీ అధికారులతో కలసి ఫ్రైడే – డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న క్షేత్రస్థాయిలో మాత్రం పెద్దగా మార్పు కనిపించడంలేదు. మండల కేంద్రంతోపాటు దుద్యాల గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా తయారైంది. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటున్నారు.

– సంబేపల్లె



సంబేపల్లెలో కాలువలో నిలిచిన మురుగునీరు



నారాయణరెడ్డిపల్లె గ్రామం యర్రగుంట్లలో రోడ్డుపై నిలిచినవున్న నీరు



దుద్యాల గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేక గుంతకు చేరుతున్న మురుగునీరు

నవోదయ విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న స్విమ్స్ వైద్యులు

రాజంపేట : మండలంలోని నారమరాజుపల్లెలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజ్ నుంచి గైనాలజిస్టు, యురాలజి, ఈఎన్‌టీ, డెంటిస్టు, పాల్మనాలజిస్టు, పిడియాట్రిషియన్, న్యూరాలజిస్టు, ఆప్తామాలజిస్టు, డెర్మాటాలజిస్టు, ఓబీజీ, కార్డియాక్‌కు సంబంధించిన నిపుణులు అవసరమైన వారికి రక్తపరీక్షలు చేశారు. కంటిపరీక్షలు నిర్వహించారు. అలాగే మెడికల్ కళాశాల వైద్యసిబ్బంది సేవలందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గీత మాట్లాడుతూ మెగా ఉచిత వైద్యశిబిరం విజయవంతంగా జరిగిందన్నారు. విద్యాలయంలో విద్యార్థులకు ఆరోగ్యపరమైన సమస్యలు రాకుండానే ముందుగానే అప్రమత్తం చేసే విధంగా వైద్య శిబిరం నిర్వహించారన్నారు. స్విమ్స్ డైరెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేశారు. మందులను అందజేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు వైద్య నిపుణులు పలు సూచనలు, సలహాలు చేశారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను శిబిరంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోండి

రామాపురం : ప్రతి రైతు సాగు చేసిన పంటలకు ఇన్సూరెన్స్‌ను చేసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రాచపల్లె గ్రామంలో రైతులతో మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఆఫ్ ఇండియా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు ఈ బీమా అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. డిసెంబర్ 15లోపు పాసు పుస్తకంతో రైతు సేవ కేంద్రం నుంచి పంట సాగు ధృవీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ వివరాలతో మీ సేవలో పొందుపరచుకోవాలన్నారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో శివారెడ్డి, రవిరెడ్డి, గంగిరెడ్డి, మదన్, లక్ష్మారెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు 11న నోటిఫికేషన్



ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇస్తున్న ఏఈ నాగేంద్ర నాయక్

సుండుపల్లె : మండలంలో డిసెంబర్ 14న జరిగే నీటి సంఘం ఎన్నికలకు 11న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు జల వనరులశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నాగేంద్ర నాయక్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీపీ కార్యాలయంలోని సభా భవనంలో ఆయన ఆధ్వర్యంలో ఎన్నికల విధులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నాగేంద్రనాయక్ మాట్లాడుతూ మండలంలో నాలుగు చెరువులకు, ఒక జలాశయానికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్నికలు జరిగే ఒక్కొక్క చెరువుకు ఒక్క ఎలక్షన్ ఆఫీసర్, అడిషనల్ ఎలక్షన్ ఆఫీసర్లు ఉంటారని, ప్రతి చెరువుకు ఆరు టీసీలు ఉండగా ఒక్కొక్క టీసీకి ఒక పీఓ, ఒక ఏపీఓలు ఉంటారని పేర్కొన్నారు. పింఛా ప్రాజెక్టుకు పింఛాలోని జెడ్పీ హైస్కూల్‌లో ఎన్నికలు ఉంటాయని, ఎన్నికల అధికారిగా ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, గునేటివాగు చెరువుకు సిద్దారెడ్డిగారిపల్లి ఎంపీపీ స్కూల్‌లో బూత్‌ను ఏర్పాటు చేయగా ఎన్నికల అధికారిగా తహసీల్దార్ దైవాదీనం, నారాయణరెడ్డి చెరువుకు జెడ్పీ హైస్కూల్ జి.రెడ్డివారిపల్లిలో బూత్ ఉండగా ఎన్నికల అధికారిగా ఆర్‌అండ్‌బీ ఏఈ సుకుమార్ బాబు, ఊటచెరువుకు జెడ్పీ స్కూల్ తిమ్మసముద్రంలో నిర్వహిస్తుండగా ఎన్నికల అధికారిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, కృష్ణారెడ్డి చెరువుకు జెడ్పీ హైస్కూల్ జీకే రాచపల్లిలో జరుగనుండగా ఎన్నికల అధికారిగా పీఆర్ ఏఈ జయసూర్య నాయక్‌లను నియమించినట్లు తెలియజేశారు. ఎన్నికలకు సంబంధించి భద్రతా రీత్యా పోలీసు వారిని బందోబస్తు నిర్వహించాలని కోరారు. ఎన్నికలు సజావుగా జరగటానికి ఆయకట్టు దారులందరూ సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ దైవాదీనం, డీటీ రెడ్డన్న, ఈఓపీఆర్‌డీ సురేష్ బాబు, ఎంఈఓలు వెంకటేష్ నాయక్, రవీంద్ర నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా లింగ నిర్ధారణ నిషేధ చట్టం

సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి



చట్టం అమలుపై సమీక్ష చేస్తున్న సబ్‌కలెక్టర్

రాజంపేట : లింగ నిర్ధారణ నిషేధ చట్టం పకడ్బందీగా అమలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాంతీయ వైద్యశాలలో డివిజన్ స్థాయిలో అడ్వయిజరీ కమిటీ పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువగా ఆడపిల్లల నిష్పత్తి ఉన్న మండలాల్లో ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లల శాతం కలిగే నష్టాలను వివరించారు. మహిళా సంఘాలు, పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు సంయుక్తంగా ఆడపిల్లలను బతకనిద్దామనే నినాదంతో ముందుకెళ్లాలన్నారు. ఆడపిల్లల సంతతి పెరిగేలా, అందుకు అవసరమైన అవగాహనలను ఎప్పటికప్పుడు కల్పించాలన్నారు. రాజంపేట డీఎస్పీ ఎన్.సుధాకర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ నిషేధచట్టం అన్ని శాఖల సహకారంతో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందన్నారు. కొత్తగా స్కానర్స్ ఏర్పాటుపై దృష్టిసారిస్తామన్నారు. తప్పనసరిగా జిల్లాకమిటీ ఆమోదం ఉండాలన్నారు. స్కాన్‌సెంటర్స్‌ను విధంగా తనిఖీలు చేస్తామన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ ఇన్‌చార్జి డా.సానే శేఖర్ మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చేసే వారిపై చట్టపరంగా కఠినమైన చట్టాలు అమలుచేస్తామన్నారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ అధికారిణి దేవశిరోమణి మాట్లాడుతూ చట్ట వ్యతిరేకంగా పరీక్షలు చేసిన వైద్యులకు మొదటిసారి తప్పుగా రూ.10వేల జరిమానా, 3 సంవత్సరాల జైలుశిక్ష, రెండవసారి తప్పుచేస్తే రూ.50వేలు, 5 సంవత్సరాల జైలు, మూడవసారి తప్పు చేసే వైద్యుల పేరు కౌన్సిల్ నుంచి తొలిగించబడుతుందన్నారు. లింగనిర్ధారణ పరీక్షలకు ప్రోత్సహించేవారికి రూ.50 వేల జరిమానా, 3 సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందని, రెండవసారి అయితే 5 సంవత్సరాలు జైలు, రూ.1లక్ష జరిమానా ఉంటుందన్నారు. సమావేశంలో వైద్యులు డా.చట్టేటి అనిల్ కుమార్, మహిళా వైద్యులు మోహర్ ముంతాజ్, స్వచ్ఛంద సంస్థలకు చెందిన వెంకటరమణ, సుబ్బనరసారెడ్డిలు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలతో దిగుబడులు



సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఓ నాగమణి

లక్కిరెడ్డిపల్లి : మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారిణి నాగమణి పేర్కొన్నారు. మంగళవారం కుర్నూతల, పందిళ్లపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మామిడి తోటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడిలో రబీలో 2024 – 25 సంవత్సరానికి వాతావరణ పంటల బీమా సౌకర్యం ప్రభుత్వం అందిస్తోందని, మామిడి రైతులు ఎకరాకు రూ.2250లు ప్రీమియం చెల్లించి పంట బీమా పొందాలన్నారు. ఈనెల 15లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. ట్రాక్టర్లు, స్ప్రేయర్స్, తర్పాలిన్ సీట్స్, జింక్, జిప్సమ్, పైప్స్ కావాలని రైతులు అడిగారు. ప్రకృతి వ్యవసాయంలో ఘన జీవామృతం, కషాయాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఎన్.జయరాణి, ఏఓ ఎం.రమేష్ బాబు, డీఆర్‌సీ సుచిత్ర, కేవీకే శాస్త్రవేత్త మానస, ఏఈఓస్ కెరోలిన్, చాన్ బాషా, గ్రామ వ్యవసాయ సహాయకులు కీర్తి, సౌజన్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓలు

చిట్వేలి : దివ్యాంగులపట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓలు కోదండనాయుడు, ఈశ్వరయ్యలు సూచించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. తల్లిదండ్రులు సంక్షేమ కార్యక్రమాలను దివ్యాంగుల ప్రగతి కోసం ఉపయోగించాలన్నారు. దివ్యాంగులను చిన్నచూపు చూడరాదన్నారు. అనంతరం పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, శిరీషా, ఉపాధ్యాయులు విజయకుమారి, చంద్రశేఖర్, విజయలక్ష్మి, రాజేష్, గంగాదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు

వీరబల్లి : మంగళవారం స్థానిక ఎస్ఐ మోహన్ నాయక్ తన సిబ్బందితో వెళ్లి రాయచోటి – వీరబల్లి మార్గమధ్యలో వాహనాలు తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా మన్సూరు మహబూబ్ బాషా మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతుండగా ఎస్ఐ గుర్తించి కేసు నమోదు చేశారు. వాహనదారుల భద్రత కోసమే ఈ తనిఖీ కార్యక్రమం చేస్తున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రెవెన్యూ సదస్సులకు స్పందన కరువు



వీరబల్లి: వంగిమళ్ల గ్రామంలో రెవెన్యూ సదస్సుకు ప్రజలు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు



నందలూరు: వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ అమర్‌నాథ్



సిద్దవటం (ఒంటిమిట్ట): ఫిర్యాదులు అందజేస్తున్న రైతులు, ప్రజలు



సుండుపల్లె: అర్జీలను అందజేస్తున్న గ్రామస్తులు

వీరబల్లి : డిసెంబర్ 6 నుంచి మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సమస్యల పరిష్కారానికి గ్రామస్థాయి సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం వంగిమళ్ల పంచాయతీలో సచివాలయం దగ్గర తహసీల్దార్ శ్రావణి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిపారు. కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. సదస్సులో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఏమీ చేయలేక అధికారులు మొక్కుబడిగా కార్యక్రమాన్ని జరిపించి మమ అనిపించారు. సిబ్బంది నిర్వాకమో.. ప్రభుత్వ అలసత్వమో.. సమస్యలు పరిష్కారం పట్ల అధికారుల తీరుపై ప్రజలకు నమ్మకం లేకనో గానీ మండలంలో రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి అనుకున్న స్థాయిలో స్పందన రావడంలేదన్నది మాత్రం వాస్తవం. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి సుస్మిత, మండలస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మడితాడులో..

సుండుపల్లె : మడితాడు గ్రామ సచివాలయంలో గ్రామ రెవెన్యూ సదస్సును మండల ప్రత్యేక అధికారి జయరాముడు మంగళవారం నిర్వహించారు. గ్రామ సభకు 54 అర్జీలు వచ్చాయని వీఆర్‌ఓ నరసింహులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న, ఎంఈఓ రవీంద్ర నాయక్, వీఆర్‌ఓ నరసింహులు, ప్రజలు పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం (ఒంటిమిట్ట) : మండలంలోని మాచుపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు, ప్రజా సమస్యల వేదిక జరిగింది. రైతుల సమస్యలకు పరిష్కారం కోసం గుట్టలు గుట్టలుగా ఫిర్యాదులు చేశారు. సర్వే నెంబరు 100/2 కృష్ణమ్మ అనే మహిళా రైతు సాగు చేసుకుంటున్న 1.50 ఎకరాల డీకేటీ పట్టా భూమి ఉందని 26సెంట్లు స్థలాన్ని కొంతమంది అన్యాక్రాంతం చేశారని, 100/1 సర్వే నెంబరు ప్రభుత్వ స్థలంలో 59 సెంట్లు అన్యాక్రాంతం చేశారని ఫిర్యాదు చేశారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని రైతుల నుంచి భూ సమస్యల పరిష్కారం కోసం 37 అర్జీలు వచ్చాయని వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాధవీలత, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ సుదర్శన్, వీఆర్‌ఓ గౌస్ బాషా పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 70 వినతులు

నందలూరు : నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని షాదీఖానాలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 70 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ అమర్నాథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ముజీబ్ బాషా, తాటి సుబ్బరాయుడు, గౌస్ బేగ్, పోతురాజు మస్తానయ్య, హిమగిరి నాథ్ యాదవ్, సీహెచ్ఓ వెంకటనారాయణ, ఆర్ఐ జ్యోతి, మండల సర్వేయర్ ప్రభాకర్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తాం

ఓబులవారిపల్లె : ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీధర్ రావు పేర్కొన్నారు. మంగళవారం బొమ్మవరంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రావు మాట్లాడుతూ రైతుల నుంచి ఆన్‌లైన్, సర్వేకు సంబంధించిన సమస్యలపై 63 అర్జీలు వచ్చాయని తెలిపారు.

బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెనగలూరు : మామిడి పంటలకు బీమా చేయాలని ఉద్యానవన శాఖ అధికారి సురేష్ బాబు అన్నారు. పొందలూరు, ఓబిలి, కొండూరు, నారాయణ నెల్లూరు రైతులకు మామిడి పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కేంద్ర ప్రభుత్వ సహకారంతో మామిడి రైతులకు ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల కలిగే నష్టాల నుంచి ఆదుకునేందుకు బీమా సౌకర్యాన్ని కల్పించిందన్నారు. ధృవీకరణ పత్రాలతో మీసేవ ద్వారా లేదా రైతు కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వారు తెలిపారు.

లింకు రోడ్డు పనులు ప్రారంభం

రైల్వేకోడూరు అర్బన్ : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో రైల్వేకోడూరు మండలంలోని ఉర్లగడ్డపోడు పంచాయతీలో హరిజనవాడకు లింకురోడ్డు నిర్మాణానికి మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ గోపి, మాజీ సర్పంచ్ ఓబుల్ రెడ్డి, వైస్ సర్పంచ్ రాజు, ఎంపీటీసీ రఘు తదితరులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదార స్వభావంతో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తదితరుల సహకారంతో ఎన్నో ఏళ్లుగా అందుబాటులో లేని రోడ్డును ప్రజలకు కల్పించడం ఎంతో శుభపరిణామమన్నారు. అలాగే గ్రామానికి మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుబ్రమణ్యం, ఎం.బాలసుబ్రమణ్యం, సుబ్బరాయుడు, మణి, నాగేంద్ర, శంకరయ్య, రవికుమార్, రఘుకుమార్, చలపతి, రమణమ్మ, శివయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించండి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ శివప్రకాష్‌రెడ్డి

సుండుపల్లె : విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని డిప్యూటీ ఈఓ శివప్రకాష్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని జికె రాచపల్లి, రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ మంచి క్రమశిక్షణతో చదివినప్పుడే ఉన్నత స్థానాలకు ఎదుగుతారని తెలిపారు. పాఠశాలలో అమలవుతున్న సంసిద్ధత కార్యక్రమాలు అమలుపై సమీక్షించారు. పిల్లలకు రుచి, శుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాలల్లోని మౌలిక సదుపాయాలను పరిశీలించారు.


ప్రజల్లో చిరస్థాయిగా జగనన్న నవరత్నాలు



అరవీడులో పార్టీ కార్యకర్తలను పరామర్శిస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : ప్రజల్లో చిరస్థాయిగా జగనన్న నవరత్నాల పథకాలు నిలిచిపోయాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం గరుగుపల్లె, అరవీడు గ్రామాల్లో పర్యటించి వివాహాలు, కార్యకర్తలకు పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజలకు అండగా నిలబడడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని సూచించారు. పాలక ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజల నుంచి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా పథకాలు మాత్రం అమలు చేయడం లేదన్నారు. కొత్త పింఛన్ల ఊసే లేకపోగా ఉన్న పింఛన్లను తీసేస్తున్నారన్నారు. విద్యుత్ బిల్లులు పెరిగిపోతున్నాయని, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఈ అంశాలపై కార్యకర్తలు ప్రజల పక్షాన నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపుతూ ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషణరెడ్డి, మాజీ ఎంపీపీ బండి చిన్నారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువ నాయకులు గుమ్మా అమర్‌నాథరెడ్డి, సర్పంచులు చెన్నకేశవరెడ్డి, రామాంజులరెడ్డి, ఉమా ప్రభాకర్, బీసీ నాయకులు రాజశేఖర్‌నాయుడు, రెడ్డి కుమార్‌తోపాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయండి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నేత కోటేశ్వరరావు

రాయచోటి అర్బన్ : జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసి సిబ్బంది కొరతను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి అనేక గురుకుల పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. పాఠ్యాంశాలను బోధించేందుకు ఉపాధ్యాయులే లేకపోతే తామెలా చదువుకోవాలంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారంటూ తెలిపారు. ప్రభుత్వ విద్య పరిరక్షించబడాలంటే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే సరైన మార్గమని చెప్పారు. పాఠశాలల్లోని ఉపాధ్యాయుల కొరతను తీర్చడంతోపాటు కనీస వసతుల కల్పనకు ప్రాధాన్యతను ఇవ్వాలంటూ కోరారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలసి జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామంటూ ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, రాయచోటి కార్యదర్శి కార్తిక్, నాయకులు సంతోష్‌నాయక్, శివలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు



మండలకేంద్రానికి సమీపంలో ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడం

పుల్లంపేట : కంచే చేనుమేస్తే అన్న చందంగా పుల్లంపేట మండలంలోని కడప – చెన్నై జాతీయ రహదారి ఏపీ మోడల్ స్కూల్ పక్కన యథేచ్ఛగా అక్రమ కట్టడాలు కొనసాగుతున్నాయి. పాఠశాలకు ఆనుకొని ప్రకాశం కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అందులో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని, వాటిని వెంటనే తొలగించాలని స్కూల్ కమిటీ చైర్మన్ రాజారెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు.

పాఠశాల ఎదురుగా ఉన్న భూమిని ఆక్రమించడం ద్వారా స్కూల్ వదిలేటప్పుడు విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతేకాకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కావున అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.